
# ముళ్ళరోలు

## తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి



విశ్వనాథం ఇల్లు మారేడు. మూడు వీధులవతలకి. చాలా కాలం ఓ ఇంటి వెనక భాగంలో చిన్న గదిన్నర కొంపలో కాలక్షేపం చేశాడు. గది లుంగీ అంత, వంటిల్లు తువాలంత. విశ్వనాథం భార్య కుంపటీ, స్టవ్ వెలిగించిన తర్వాత నిజానికి ఇల్లంతా వంటిల్లులాగే వుండేది. పదిహేను రోజుల క్రితం బజారు నుంచి తోటకూర కొనుక్కుని, గేటు తీసుకుని వెనక వేపుకి వెళ్ళబోతున్నాడు. ఇల్లు గలాయన ముందు గదిలోంచి పిలిచాడు.

"విశ్వనాథంగారూ, మాట."

క్షణంసేపు ఆగిపోయి మెట్లెక్కి ఎదురుగా నుంచుని అన్నాడు విశ్వనాథం.

"నమస్కారం"

"ఆ. బజార్నించి కాబోలు. సంచీ ఇచ్చి రండి. పనుంది" కళ్ళజోడు లోంచి చూస్తూ వుండి పోయాడు విశ్వనాథం.

"కొంచెం మాట్లాడాలి. సంచీ ఇచ్చి రండి"

"అలాగేనండి. వస్తానండి"

మెట్లు దిగుతున్న విశ్వనాథాన్ని చూస్తూ వుండిపోయాడు ఇంటి యజమాని. మెట్లెక్కి దెబ్బ తగుల్తుందేమో నన్నట్టు నడుస్తాడు విశ్వనాథం. చాలాసార్లు విశ్వనాథం గేటు తియ్యడం చూశాడు. గేటు గడియ మీద చెయ్యి వేసి ఓసారి శూన్యంలోకి చూసి మెల్లిగా తీస్తాడతను. తలుపు అవతల,ఇవతల ఏదో అదృశ్య హస్తం చటుక్కున పీక పట్టుకుంటుందన్నట్టుగా భయంగా తీస్తాడు. ఇవతలవున్నప్పుడు అవతలకీ,అవతల వున్నప్పుడు ఇవతలకీ రావడం ఇష్టం వున్నట్టు కనిపించడతను. తలుపు తియ్యడం,ఇంటి యజమానికి కనబడ్డం కూడా తప్పేనన్నట్టుగా వుంటాడు విశ్వనాథం. నిజానికతను ఎప్పుడూ ఏదో తప్పు చేసినట్టే కనబడతాడు. సందులోంచి వెనక్కి వెళ్ళి ఇంటి గుమ్మం దగ్గిర నుంచుని భార్యని పిలిచి సంచీ ఇస్తూ చెప్పాడు.

"ఇల్లు గలాయన పిలుస్తున్నాడు"

(రేపు నన్ను ఉరితీస్తారుట)

"వెళ్ళండి - ఏం సిగ్గా?"

(బాగానే వుంటుంది)

"వెళ్ళొస్తాను"

(ఇదే ఆఖరి చూపులు)

ఇంటి యజమాని కాఫీతో సహా సిద్ధంగా వున్నాడు

"తీసుకోండి"

("కొంచెం విషం కలిపేను")

జంకుగా వినయంగా కాఫీ గ్లాసు తీసుకున్నాడు విశ్వనాథం. తరువాత పదిహేను నిముషాలు ఇల్లు గలాయన మాట్లాడేడు. విశ్వనాథం గుటకలు మింగేడు. తాగే కాఫీ లావాలాగ వుంది. మాట్లాడ్డం అయిపోగానే విశ్వనాథం అక్కడే వున్నా లేనట్టు రూఢి అయిపోయింది.

"వెళ్ళి రండి. మీకు ఇబ్బంది కలిగిస్తున్నందుకు మరోలా అనుకోకండి"

ఇంకో క్షణం అక్కడ వుండడం తప్పవుతుందని నమస్కారం పెట్టి వెళ్ళిపోయాడు.

లోపలికి వెళ్ళగానే అడిగిందామె. పడక కుర్చీలో కూచుంటూ అన్నాడు విశ్వనాథం.

"ఇల్లు ఖాళీ చెయ్యమన్నారు"

"అదేం పోయే కాలంట. ఇన్నేళ్ళ నుంచీ వుంటున్నాం"

"దీన్ని పడగొట్టి వేరే కడతారట"

"ఛావమనండి"

"...అద్దెకి ఎక్కడ దొరుకుతాయి?"

"సోది అడిగితే తెలుస్తుంది. లేవండి. నాలుగు మెతుకులు తిని వీధిన బడండి. ఈ మాత్రం దరిద్రపు కొంప దొరక్కపోదు"

"అద్దె ఏ మాత్రంలో వుంటుందో మనం ఇచ్చుకోలేం గదా"

"ఈ మూల శంకల కేవీ లోటు లేదు"

మొత్తానికి వెంటనే కాకపోయినా మధ్యాహ్నం దాటిన తరువాత ఇళ్ళ కోసం తిరుగుడు మొదలు పెట్టాడు. ఉదయం, సాయంత్రం రెండు రోజుల పాటు అన్ని వీధులూ తిరిగేడు విశ్వనాథం. అద్దెకి ఇళ్ళు లేవని కాదు. తనకి కావలసినంత చిన్న ఇల్లు దొరకడం కష్టంగా వుంది. ఇంచుమించు అరవై సంవత్సరాల నుంచీ తనకి కావలసిన ఇల్లు ఎందుకు దొరకడం లేదో అర్థం కాలేదు విశ్వనాథానికి. రెండు రోజులు వీధులు తిరుగుతూ, ఇటీవల కట్టిన అందమైన ఇళ్ళు చూస్తూ హఠాత్తుగా తానెందుకు తిరుగుతున్నాడో మర్చి పోయాడతను. అప్పటికే చాలాసేపటి నుంచీ తిరిగిన రెండు వీధులే తిరుగుతున్నాడు. మూడో రోజు సాయంత్రం దేవుడు కనిపించాడు. విశ్వ నాథాన్ని చూడగానే రిక్షాఆపి అడిగాడు.

"ఏడకయ్యగారూ?"

"ఇల్లు కావాలిరా- అద్దెకి"

"ఇలా చూసుకుంటూపోతే దొరుకుద్దేటండి"

"బయట బోర్డు రాస్తారు గదరా"

"ఎక్కండి. నాలుగీదులూ తిప్పి ఇంటికి పోతాను"

బలవంతంగా రిక్షా ఎక్కించాడు దేవుడు. ప్రస్తుతం వున్న ఇల్లు వాడి కళ్ళలోనే పడింది. రెండు సార్లు తిరిగి రిక్షాలో వాడే సామాన్లు చేరేశాడు. నవారు మంచం, రెండు చాపలూ, కాసిని గిన్నెలూ, డబ్బాలూ. కొన్ని దశాబ్దాల జీవనాన్ని అవలీలగా మార్చేడు దేవుడు. గ్లాసెడు నీళ్ళ మజ్జిగ తప్ప విశ్వనాథం దగ్గిర పైస తీసుకోలేదు. పైగా ఎప్పుడు కనిపించినా రిక్షాలో ఇంటి దగ్గర దింపుతాడు. ("బాగా దొరికేడు మీకు") ఎందుకో తెలీదు విశ్వనాథానికి.

సామాన్లన్నీ చేరేసిన తరువాత ఆఖరి సారిగా పాత ఇంటికి వెళ్ళాడు విశ్వనాథం. ఇంకా చీకటి పడలేదు. లోపలికి వెళ్ళి మంచున్నాడతను. ఏవీ మర్చిపోలేదు. గోడకి అతుక్కుపోయిన రెండేళ్ళ కిందటి కేలండర్ తప్ప. మర్చిపోడానికి మిగిలిందేం వుంది? ఇరుకు ఇల్లు. ఓ చీకటి బొరియ. ఎల్లా వున్నాడతను? కాసేపటికి బయట గోడ దూకి చీకట్లు పరుచుకుంటున్నాయి. మెత్తగా నిశ్శబ్దంగా జారేనీటిలా ఇంట్లోకి చీకటి వచ్చేసింది. విశ్వనాథం గమనించలేదు. నల్లగుడ్డు లేని తెల్ల గుడ్డులా వుంది కిటికీ. చుట్టూరా చూసుకున్నాడతను. ఈ చిరుచీకట్లో ఏదో అయస్కాంత శిల తనని నిలబెడుతోంది. ఆ కాలెండర్‌కీ తనకీ ఎప్పుడూ ఎటువంటి సంబంధం లేదు. దాని పెద్ద గళ్ళలో పాల లెక్కలు వేసిందామె. మాసిన తెల్లపంచ, చొక్కాలో పొడుగ్గా, పల్చగా విశ్వనాథం చీకట్లో తేలిపోతున్నట్టూ, పూడ్చేసిం తరువాత ప్రాణం వచ్చినట్టూ వున్నాడు. గోడల మీద చాలా మేకులు దిగేసి వున్నాయి. మేకులు మళ్ళీ కొనాలన్నా కష్టమే. గోడ మీద మొన్నటి వరకూ వెంకటేశ్వర స్వామి ఆధారపడ్డ మేకుని లాగేడు. రాలేదు. ఆ మేకుని ఎవరు కొట్టేరో జ్ఞాపకం రాలేదు. ఆమె అయి వుంటుంది. పచ్చడి





అతి తక్కువ సమయంలో అందమైన ఫినిష్! వాల్‌టెక్

**NCL ALLTEK LTD.** Hyderabad - 500 001.

## నిద్రిత నగరం

సగం మూసుకున్న కనురెప్పలను బరువుగా వాలుస్తో
విశాఖ నిద్రలోకి నెమ్మదిగా జారుకుంటుంది.
పెట్రోలు వాసన్ల నుంచి ఫ్యాక్టరీ సైరన్ల నుంచి
నిరంతరం సాగే జనసమూహాల కోలాహల ప్రవాహం నుంచి
తెల్లని పొగమంచు పరదాలలోకి
విశాఖ నిశ్శబ్దంగా తప్పుకుంటుంది.

దేవకన్యల తారాహారాలు నేలకు జారాయేమో
నగరం జడలో దీపాల మాలల్ని అలంకరించుకుంది.
నిద్రిస్తున్న నగర సౌందర్యాన్ని నిర్నిమేషంగా చూస్తో
కలల అలల మీద తేలుతోన్న నావల్ని
దక్షిణపు గాలి ఆగి ఆగి అలవోకగా స్పృశిస్తోంది
ఏ హరిణ నయన చేతి అమృత భాండం లోంచి తొణికిన వెన్నెలో
సముద్రం మీద చెల్లాచెదరైన ముత్యాలసరంలా పరచుకుంది
సద్దుమణిగిన పరిసరాల్లోకి సరుగుడు చెట్ల నీడల్లోంచి
ఏదో సన్నని రాగం అలలు అలలుగా వ్యాపిస్తోంది
అలసిన కన్నులలో స్వాప్నిక చంద్రికల్ని నింపుకొన్న విశాఖ
నిద్రని మేలిముసుగులా తన ముఖం మీదకి కప్పుకొంది.

- సి. వైదేహి



బండతో బాదిన బాపతు రాలేదు. తన వల్ల కాదు. ఈదుకుంటూ బయటికి వచ్చాడు. ఇల్లు గల వారింట్లో లైట్లు వెలిగాయి. సాగిన కిటికీ వెలుగు సందులోపడింది. కళ్ళజోడు తుడుచు కుంటూంటే చటుక్కున జ్ఞాపకం వచ్చింది విశ్వనాథానికి. ("ఎదురు గుండా కనిపిస్తూంటే ఎలా మర్చిపోయారూ?") గుమ్మానికి ఎడం వేపుగా గోడ చివర ఇంచుమించు శాశ్వతంగా వల్లగా వుండి పోయింది రుబ్బురోలు. మట్టిలో కూచుందేమో చుట్టూరా చిన్న చిన్న లేత మొక్కలు లేచాయి. మెల్లిగా దాని దగ్గరికి వెళ్ళాడు విశ్వనాథం. రుబ్బురోలు గుండెల మీద వున్నట్టుంది. అతనికి భయమేసింది. చిన్న దడ పాదాల్లోంచి నరాల్ని ఒణికిస్తూ సన్నపాములా బయలు దేరింది. రుబ్బురోలు మీద కూచుండి పోయాడు విశ్వనాథం. దీన్ని ఎప్పుడు చేయిం చాడో జ్ఞాపకం లేదు. పెళ్ళి అయిన తరువాత అయి వుంటుంది. తను చిక్కిపోయాడు గాని ఇది చెక్కుచెదరలేదు. తీవ్రంగా ఆలోచించాడ తను. అతనికి యవ్వనం గుర్తు రావడం లేదు. గోదావరి పాయదాటేరు. చీకటి పడింది. ఎద్దుల బండి సిద్ధంగా వుంది. ఎవరెవరు? ఇద్దరికీ ఒక గూడు బండి. ఎండు గడ్డి వాసన. అది రోడ్డు కాదు. ఏదో ఎండిపోయిన కాలువలా వుంది. పెద్ద కుదుపుకి ఒళ్ళో పడింది కొత్త భార్య. నిజానికి ఏదీ స్పష్టంగా జ్ఞాపకం లేదు. రుబ్బురోలు మరి? లాభం లేదు. ఎప్పుడో తను పరాగ్గా వున్నప్పుడు ఎక్కణ్ణుంచో దొల్లుకుంటూ వచ్చి వుండి పోయింది. చటుక్కున లేచాడతను. ఓ క్షణం రుబ్బురోలు వేపు తీవ్రంగా చూసి ఒంగుని రెండు చేతులూ అంచు మీద వేసి బలంగా తోశాడు. చలనం లేదు. ముక్కు మీదికి జారిన కళ్ళజోడు పైకి తోసుకుని గట్టిగా ఊపిరి పీల్చి మళ్ళీ తోశాడు.

"ఏం చేస్తున్నారు విశ్వనాథంగారూ?"

ఉలిక్కిపడి లేచి నుంచున్నాడు. ఇల్లు గలాయన. ఏదో తప్పు చేసి పట్టుబడ్డట్టు నుంచున్నాడు విశ్వనాథం.

"రుబ్బురోలు" అన్నాడు చివరికి.

"మీ వల్ల అవుతుందనే. మీకు చాతకాదు. దాన్నలా వదిలెయ్యండి. రేపుదయం మా పని వాడి చేత పంపిస్తాలెండి వెళ్ళండి"

మరోసారి రాయివేపు చూసి తలవంచుకుని వెళ్ళి పోయాడు విశ్వనాథం. మర్నాడు రిక్షాలో వేయించి పంపించాడు ఇంటి యజమాని.

తెల్లవారు జాము నుంచీ వర్షం పడుతోంది. గట్టి వర్షం కాదు. ఏడుస్తున్నట్టుగా ఆగి ఆగి కురుస్తోంది. కాఫీ తాగి పడుకుర్చీలో కూర్చు న్నాడు విశ్వనాథం. పైన రేకు మీద వర్షపు శబ్దం. మబ్బు పట్టిందేమో ఇల్లు కొంచెం చీక టిగానూ, చెమ్మగానూ వుంది. గంట తరువాత కొంచెం తెరిపి ఇచ్చింది. మబ్బు పొర కొంచెం తొలిగింది. స్నానం చేసి పది గంటలకి మళ్ళీ కుర్చీలో కూచున్నాడు విశ్వనాథం. మళ్ళీ జల్లు మొదలైంది. రేకులు దడదడ మంటున్నాయి. పై నుంచి నీరు కారడం మొదలైంది. కింద క్రమంగా తడి వ్యాపిస్తోంది. లోపలికి వెళ్ళి చిన్న సత్తుగిన్నె తీసుకొచ్చి సరిగ్గా నీళ్ళు పడే చోట పెట్టేడు. టప్ టప్ మని వేగంగా గిన్నెలో పడుతున్నాయి నీళ్ళు. కాసేపటికి గిన్నె చుట్టూరా తడి అయిపోయింది. లేచి వెళ్ళి చూశాడు. ఒక్క చుక్క లేదు గిన్నెలో. గిన్నె ఎత్తి వెలుగు వేపు పెట్టి చూస్తే కనిపించింది చిల్లుగిన్నె. ఒళ్ళు మండి పోయిందతనికి. మరోసారి గిన్నె వేపు చూసి విసిరేశాడు. అది వంటింట్లోంచి వెళ్ళి గుమ్మం పక్కనే ఉన్న రుబ్బు రోలుకి తగిలి ఠంగు మంది.




"ఏవిటా గిరవాట్లు? బంగారం లాంటి గిన్నె"

"చిల్లు గిన్నె"

"ఏం అయితే. మీరు కొన్న స్టీలు గిన్నె లన్నీ దాచేసుకున్నా ననుకున్నారా?"

లోపల ఏదో మాడిన వాసన, గది చెమ్మతో కలిసి దట్టంగా వ్యాపించింది. వర్షం మళ్ళీ ఆగింది. వంటింటి గుమ్మం బయట రుబ్బు రోలు పెట్టి వెళ్ళి పోయాడు ఇల్లు గలాయన పనివాడు. విశ్వనాథం దృష్టి రుబ్బు రోలు మీద పడింది. వర్షంలో తడిసి నల్లగా ఉంది. ఇంకెలా వుంటుంది? ఎన్నివేల పచ్చళ్ళు చేసినా అరిగి చావదు. విచిత్రమైన తన్మయత్వంతో రుబ్బ రోల్ని చూస్తున్నాడు విశ్వనాథం. అది మెల్లిగా సూక్ష్మరూపం దాల్చి అతని గుండెలో దూరి మళ్ళీ యథా రూపం పొందినట్టుంది. కాసేప టికి విశ్వనాథానికి రుబ్బరోల్ని మోస్తున్నట్టుగా వుంది. ఫుట్‌బాల్‌లా దాన్ని తన్ని అతవల పారేద్దామనిపించింది. ఎవరో శత్రువు తిష్ఠ వేసుక్కూచున్నట్టుంది.

"ఏవిటంత కోపంగా చూస్తున్నారు? నన్నా? నిజమే లెండి. ఓపికలేగ్గానీ నవిలి మింగేద్దురు"

తేరుకుని ఆమె వేపు చూశాడు.

''కూరా నారా లేదు. చారు వేశాను. పోపు మాడి తగలడింది. ఓ గుప్పెడు పెసరపప్పు వుంది.

పచ్చడి చేస్తాను''

''నేనేం చెయ్యను!''

''మిమ్మల్ని పచ్చడి చెయ్యమంటంలే. రుబ్బి రోలు సగం గుమ్మం మీద సగం నేల మీద పడేసి పోయాడు. దాన్ని కాస్త కిందికి తొయ్య గలరా?''

మరోసారి ఆమె వేపు చూసి లేచేడు విశ్వనాథం. లుంగీ ఎత్తి కట్టేడు. ఒక కాలు నువ్వెంత అన్నట్టు రోలు మీద పెట్టేడు. నిజమే. ఆఖరి మెట్టు మీద కొంచెం ఆని వుంది. వంటింటి చూరు కింద వేశాడు వాడు. ఎక్కడో ఉరిమింది. రేకులుదద్దరిల్లేయి.

''మళ్ళీ కురిసి చస్తుందేమో. కానివ్వండి. అసలు మీ వల్ల అవుతుందా?''

ఆమె వేపోసారి కోపంగా చూసి రోలు మీదికి ఒంగేడు విశ్వనాథం. అతన్ని సన్నటి చేతుల మీద నరాలు ఉబ్బేయి పల్చగా, ఎండి పోయిన పాత కాయితంలా వున్న చర్మం చిట్లి పోతుందనిపిస్తోంది.

కళ్ళజోడు ముక్కు చివరికి జారిపోయింది. గుమ్మం మీద నుంచుని కిందికి తొయ్యాలని ప్రయత్నం. విశ్వనాథం వల్లకాలేదు.

''మీరు కింద నుంచోండి. నేను నెడతాను''

''ఒద్దు. నేను తోస్తాను''

''మీ వల్లనేవవుతుంది? అడ్డు లేవండి''

కింద నుంచున్నాడు విశ్వనాథం. జారిన గూడ కట్టు కట్టుకుని రుబ్బు రోల్ని తన వేపు బలంగా లాగడానికి ఒంగి అంచు చుట్టూ చెయ్యి వేశాడతను. రెండో మెట్టు మీద ఒంగుని తోసిందామె. మూడో తోపుకి కదిలి రుబ్బురోలు కిందభాగం నేల మీదకి జారింది.

''అమ్మో చంపేశావే''

విశ్వనాథం ఆర్తనాదం మరో ఉరుములో కలిసి పోయింది. కాలి బొటన వేలు పట్టుకుని మరోసారి అరిచాడు. పాదం ఎక్కడుందో చూసుకోలేదు. రుబ్బురోలు జారి కొస అతని బొటన వేలు మీద పడింది. పాదం పట్టుకుని విలవిల్లాడేడు విశ్వనాథం. మళ్ళీ జల్లు మొదలైంది. కుంటు కుంటూ లోపలికొచ్చి కుర్చీలో కూలబడి వేలు చూసుకున్నాడు. బొటనవేలు చివరి భాగం చితికింది. చేతికి రక్తం అంటుకుంది. విశ్వనాథం కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''బావుంది సంబడం. కాలెక్కడ పెట్టాలో కూడా చెప్పాలా? మీద పడుతుందని తెలీదు కామోసు''

గుడ్డ చింపి చిటికెడు కాఫీ పొడుం తీసుకొచ్చి గాయం మీద కట్టు కట్టిందామె.

''ఆ పనేదో నే జేసినా బావుండు. సంతానం కోసం సలి గంగ స్నానానికెడితే ముసలి మొగుణ్ణి మొసలి కరుచుకు పోయిందట.''

అతను వినలేదు. కళ్లజోడు తీసి చేత్తో ముఖం తుడుచుకున్నాడు. అరచేత్తో కంటితడి తుడుచుకుని కళ్లజోడు తగిలించాడు. గాయం వేపోసారి చూసుకుని, నోరుకొంచెం తెరచి రుబ్బురోలు వైపు చూస్తూ ఉండిపోయాడు. అతనికి కోపంగా లేదు. బెంగతో కలిసిన కసేదో, పాతికేళ్ళ వాడిచేతులో అన్యాయంగా తన్నులు తిన్న ఆరేళ్ల వాడిలా. రేకుల మీద రాళ్ళు పడ్డట్టు పెద్ద చినుకులతో వర్షం మొదలైంది.

మర్నాటికి నొప్పి తగ్గలేదు. (''చీంబట్టిందో ఏంపాడో, ఎవర్నైనా ముష్టెత్తి ఇంజక్షనేనా చేయించుకోండి'') వర్షం తగ్గింది. మబ్బుగా ఉందేమో నాలుగయ్యేసరికి ఇంట్లో చీకటి పడింది. చిన్న స్టీలు గ్లాసుతో కాఫీ ఇచ్చిందామె. వేడిగా నీళ్లలా ఉంది.


**ఉద్యోగ అవకాశములు**

**RECOGNISED BY THE GOVT. OF A.P. R.C.NO.I I/5678/92**

దరఖాస్తులు కోరబడుచున్నవి. నిరుద్యోగులకు సదవకాశం. ఆం.ప్ర. ప్రభుత్వ టెక్నికల్ బోర్డువారు నిర్వహించు పరీక్షలయందు శిక్షణ ఇవ్వబడుచున్నవి.

**⊗ టైలరింగ్ - ఎంబ్రాయిడరీ**
**డ్రాయింగ్ - అగ్రికల్చరల్**
**వీవింగ్ - ఎలక్ట్రీషియన్ - రేడియో**
**టేపు రికార్డరు - T.V - V.C.P & V.C.R**
**మెకానిజమ్ కూడా కలదు.**

గమనిక: S.C, S.T, B.C విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వమువారు యిచ్చు స్కాలర్‌షిప్‌లు ఇవ్వబడును. స్త్రీ, పురుషులకు వేరు, వేరు ఉచిత హాస్టల్, భోజన సౌకర్యము కలదు. పూర్తి వివరములకు 10 రోజులలోగా 10/- రూ. M.O. చేసి దరఖాస్తుఫారములు పొందగలరు. ఉత్తీర్ణులైనవారు రూ. 1250/- నుండి రూ. 1650/- వరకు జీతం పొందవచ్చును. పోస్టల్ కోచింగ్ కలదు.

RAVITEJA

శిక్షణా కాలము: 3 నెలలు (సంవత్సరముకోర్సులుకూడాకలవు)
విద్యార్హత: 7th పాస్ మరియు డిగ్రీ వరకు.

PRINCIPAL & CORRESPONDENT

**VIJAYALAKSHMI TECHNICAL TRAINING CENTRE** Regd by Govt. of A.P. No-290/91

AUTONAGAR GATE, R.T.C. COLONEY, VIJAYAWADA-520007

వడబోసిన గుడ్డ వాసన. కాఫీ చప్పరిస్తూ ఆలోచనలో పడ్డాడు విశ్వనాథం. బొటనవేలు చూసుకున్నాడు. చాలా సేపలా ఉండిపోయాడు.

"ఎక్కడికీ అలా కుంటు కుంటూ?"

రోడ్డు మీదికొచ్చేడు విశ్వనాథం. నడుస్తూంటే కొంచెం నొప్పిగానే వుంది. వర్షం పూర్తిగా ఆగిపోయింది. మబ్బుపట్టి గాలి ఆడ్డం లేదు. ఆ పేట అయిదారు వీధులూ దాటే డతను. ఇంచు మించుగా ఆరుబయలు స్థలం. ఖాళీ స్థలానికి అవతలి అంచునుంచి ఇళ్లున్నాయి. ఇవతలి వేపు నాలుగు పెద్ద చింత చెట్ల కింద ఒక అరడజను గుడిశలు. వర్షంలోనావి గుడిశలు నల్లగా, చింతచెట్లు పెట్టిన చచ్చిన గుడ్లలా ఉన్నాయి. ఇళ్ల ముందు పెద్ద రాళ్లూ, రాతి పెచ్చులూ. సగసగం చేసిన రుబ్బు రోళ్లూ పాత్రాలూ బయటపడి ఉన్నాయి. నీళ్లు నిండిపోయాయి రుబ్బు రోళ్లలో. విశ్వనాథాన్ని చూసి ఒకతను బైటి కొచ్చేడు. నోట్లోంచి బీడీ తీసి అడిగేడు.

"ఏం గావాలయ్యగారూ?"

రుబ్బు రోళ్లకేసి చూస్తున్నాడు విశ్వనాథం.

"రుబ్బు రోలాండీ?"

"ఎంత?"

"చిన్న సైజులు ఉంటాయండి. పెద్దయ్యి ఉంటాయండి. అల్లాపెద్దది ఏభై ఉంటుందండి."

"రేపుంటావా?"

"రేపేటండి, ఎప్పుడూ ఈణ్నే ఉంటాం."

మాట్లాడకుండా వెనక్కి మళ్లేడు విశ్వనాథం. తిరిగ్గా నాలుగు వీధులూ తిరిగేడు. అతనికి సిగరెట్టు కాల్చాలనిపించింది. జేబులో, చేతికి పదిహేను పైసలు తగిలేయి. ఇంటి సందు తిరుగుతూంటే దేవుడు ఎదురొచ్చేడు. రిక్షా ఆపేడు వాడు.

"ఏణ్నించయ్యగారూ!"

"ఒరేయి, రేపుదయం పదిగంటలకి రాగలవా?"

"ఒస్తానండి"

"నమ్మకమేనా!"

మరోసారి ఒస్తానని చెప్పి వాడు వెళ్లిపోయాడు. ఇంటి ముందు మంచుండిపోయాడు విశ్వనాథం. లోపల ఎలక్ట్రిక్ దీపం ఓపికలేక వెలుగుతోంది. రెండిళ్ల మధ్య కొంచెం వెనగ్గా కూరుకుపోయిన రేకుల షెడ్డు. దీపం లేకపోతే ఉన్నట్టే తెలీదు. అలా కాసేపు చూస్తూ మంచున్నాడతను. శూన్యంలో వెలుగుతున్నట్టుంది బల్బు.



## కదన కుతూహలరాగం

ధ్వనికీ ప్రతిధ్వనికీ మధ్య నేను
హింసకీ ప్రతి హింసకీ మధ్య నేను
విధ్వంసానికీ నిర్మాణానికీ మధ్య నేను

ప్రణానికీ రక్త కణానికీ మధ్య నేను
కలలకూ వధ్య శిలలకూ మధ్య నేను
మౌనానికీ మానవాగ్నికీ మధ్య నేను

చిదిమిన గాయాలకూ
చిందిన వెలుతురుకూ మధ్య నేను
కన్నీటి లోయలూ
నెత్తుటి శిఖరాలకూ మధ్య నేను
అణచివేతకూ...
ఆయుధానికీ...
మధ్య
నేను-

— అలిశెట్టి ప్రభాకర్

అరవయ్యేళ్ల శూన్యం. సున్నాళ్లాగ. సున్నా ఉందని అతనికి తెలుసు. చిత్రం. సున్నాలో వెలగలేక వెలిగే బల్బుకీ తనకీ తేడాలేదు. చెప్పులు గుమ్మం దగ్గిర విడిచి లోపలికి వెళ్లేడు విశ్వనాథం. కుర్చీలో కూచుని వంటింటి వేపు చూశాడు. తలుపేసుంది. రుబ్బురోలు కనబడ్డం లేదు.

ఉదయం పదిగంటలకల్లా తయారయ్యేడు విశ్వనాథం. మాటిమాటికీ తలుపువేపు చూస్తున్నాడు. పదిన్నర దాటేసరికి విశ్వనాథానికి కాలు నిలవలేదు. అతనిలో విచిత్రమైన అలజడి, తొందరా ఏర్పడ్డాయి. రోడ్డుమీదికి వెళ్లి మంచున్నాడు. మరో పదిహేను నిముషాలు గడిచేయి. గుమ్మంలోకొచ్చి అడిగిందామె.

"నూనె చుక్కలేదు కొంపలో"

"ఇదిగో వెడుతున్నాను."

"ఏం పెట్టి తెస్తున్నారు?"

"అందుకే వెడుతున్నా."

సందు చివరి దేవుడి రిక్షా కనిపించింది. విశ్వనాథం బరువు తగ్గేడు. విశ్వనాథాన్ని వెనక్కి తప్పుకోమని వంటింటి గుమ్మం దగ్గర నుంచున్నాడు దేవుడు. రుబ్బురోల్ని నిలువుగా నిలబెట్టి దొర్లించబోతూ అన్నాడు.

"ఇది మీ వల్లేనవుద్దండీ. మాసేతులకయితే లొంగుద్ది"

దొర్లించుకుంటూ తీసికెళ్లి రిక్షాలో పడేశాడు. వాడు దొర్లిస్తూంటే విశ్వనాథం ఆశ్చర్యంగా చూశాడు. వీడికి సులువు తెలుసుననుకున్నాడు. తనకి పట్టు దొరకలేదు.

గుడిశలోంచి బయటికొచ్చి "చిన్న ఈడ కొచ్చేరుగదా?" అన్నాడతను. రిక్షాలో రుబ్బురోలు చూపిస్తూ అన్నాడు విశ్వనాథం.

"అదుగో రుబ్బురోలు."

"ఏం చెయ్యమంటారు? కక్కుకొట్టమంటారా!"

"కాదు. అమ్మేస్తాను. ఏభై అన్నావు గదా. ఇదా పాతది. సగం ఇవ్వు."

"ఏటీ– అదమ్ముతారా? బలే ఓరండీ."

అతను పగలబడి నవ్వేడు. నవ్వు ఆపుకోడం కష్టంగా ఉంది. నవ్వినవ్వి అతనికి కళ్లలో నీళ్లు తిరిగేయి.

రిక్షా వెనక్కి తీసికెడుతూ దేవుడన్నాడు.

"మంచో రయ్యగారూ, దీన్నెవరు కొంటారండీ."

ఇంటిదగ్గర దింపి రుబ్బురోలు గుమ్మం పక్క సందు దగ్గిర పెట్టి సాయంత్రం వస్తానని వెళ్లిపోయాడు దేవుడు. సన్నటి సందు. వంటింటి పక్క గుమ్మం వరకూ కొంచెం మెరగ్గా ఉంటుంది. వర్షం పడిందేమో తడిగా, కొంచెం బురదగా వుంది.

విశ్వనాథం లుంగీపైకి కట్టేడు. రుబ్బురోల్ని నిలువుగా పడేసి తోసుకు వెళ్తే తప్ప లాభం లేదు. ఓసారి ఆకాశం వేపు చూశాడు. కాళ్లు రెండూ ఎడంగా పెడుతూ బొటనవేలు వేపు చూశాడు. నొప్పి అలాగే ఉంది. తగ్గలేదు. గట్టిగా ఊపిరిపీల్చి పల్చటి పేకముక్కలాంటి పాదాల్లోంచి విశ్వనాథం శరీరంలోని ప్రతి అణువునూ, రక్తనాళాన్నీ, నరాన్నీ కదిలిస్తూ పళ్లు గిట్టకరిచి, మూలుగుతూ రుబ్బురోల్ని నిలువుగా పెట్టే ప్రయత్నంలో ఉన్నాడు. ఒళ్లూ, మొహం చెమటతో తడిసిపోయాయి. కళ్లజోడు జారిపోయింది. రుబ్బురోలు శాశ్వతంగా అతని చేతుల్లో ఉన్నట్టు ఊపిరి పీల్చుకోడానికి ఆగిన విశ్వనాథం విశ్వలన చిత్రంలా ఉన్నాడు.

●